విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- 1వ తేదీనే పింఛన్లు పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలి
- లబ్ధిదారులకు ముందస్తు సమాచారం అందించాలి
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలోని పింఛను దారులందరికీ 1వ తేదీనే పింఛన్లు పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో నేటి నుండి ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్దిదారులకు ఇంటివద్దనే చెల్లించడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. నేటి ఉదయం గం.6నుంచి పింఛన్లు పంపిణీ కావాలన్నారు. మొదటి రోజే నూరు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి గ్రామం, వార్డులో ముందస్తు ప్రచారం చేపట్టాలని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లే అవకాశం ఉన్నందున, పింఛన్ల పంపిణీపై వారికి ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో 2,31,874 మంది పెన్షన్ దారులు వున్నారని, వీరికి రూ.97.26 కోట్లు పంపిణీ చేయవలసియున్నదన్నారు. పెన్షన్ పంపిణీకి 4,243 మంది సిబ్బందిని మ్యాప్ చేసినట్టు తెలిపారు.

ఉత్తమ ప్రతిభతో పోలీసు ప్రతిష్టను ఇనుమడింపజేయండి : ఐజి అశోక్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలని ఏలూరు రేంజ్ ఐజి జీవిజి అశోక్ కుమార్ ఆకాంక్షించారు. ఏలూరు జిల్లాలో గత నెలలో ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను బుధవారం ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏలూరు రేంజ్ ఐజీ జివిజి.అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సత్కరించారు. జిల్లాస్పెషల్ ఎన్ఫోర్స్మెంట్‌బ్యూరో అదనపు ఎస్పి ఎన్.సూర్యచంద్రరావు కలిదిండి మండలంలో ఏర్పడిన శాంతి భద్రతల సమస్యను ఎంతో చాక చక్యంతో పరిష్కరించి ఎటువంటి నష్టం కలగకుండా సమస్యను పరిష్కరించిన నేపథ్యంలో ఏఎస్పీని ప్రత్యేకంగా అభినందించారు వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

ఇంటింటికి వెళ్లి యోగక్షేమాలపై ఆరా

విశాలాంధ్ర-యలమంచిలి: గోదావరి వరద తాకిడికి గురైన యలమంచిలి మండలంలోని కనగాయలంక, పెదలంక గ్రామాలలో కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పర్యటించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం చాకలి పాలెం రేవు నుండి పడవలో ప్రయాణించి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి లంక చేరుకున్నారు. లంక ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించి, స్థానికంగా ఉన్న పరిస్థితులను, పంట నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న 25 కేజీల బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులు అందరికీ అందాయా? పశుగ్రాసంకు ఇబ్బంది లేకుండా పశువులు దాణా అందిందా? ఇక్కడ ప్రధానంగా ఏమి పంటలు పండిస్తారు, ఎంత మేర నష్టం జరిగింది తదితర వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిత్యవసర వస్తువులు అందరికీ అందాయని, పశువుల దాణాకు ఇబ్బంది లేదని స్థానిక ప్రజలు తెలిపారు. కనగాయలంకలో సుమారు 750 ఎకరాలలో కొబ్బరి తోటలు, తమలపాకులు, కూరగాయలు సాగు చేస్తున్నారన్నారు. 40 ఎకరాల్లో తమలపాకులు సాగు చేయగా 30 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, అలాగే 10 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని, సుమారు 43 మంది రైతుల వరకు నష్టపోయారని సచివాలయం వ్యవసాయ కార్యదర్శి జిల్లా కలెక్టర్ కు వివరాలను అందించారు. ఈ పర్యటనలో నరసాపురం ఆర్డీవో యం.అచ్యుత్ అంబ రీష్, యలమంచిలి తహసీల్దార్ సి.హెచ్ విజయశ్రీ, ఎంపీడీవో పి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీసిల్దార్ పూడి డేవిడ్ సన్, వీఆర్వో ఎస్.లక్ష్మి, గ్రామ సర్పంచ్ టీ.నాగరాజు, సచివాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర - ఏలూరు : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం, నాణ్యమైన వస్తువులు పంపిణీ, పంపిణీ విధానం, ధరల స్థిరీకరణ, తదితర అంశాలపై వివిధ వర్గాల నుండి అభిప్రాయాలను, వారి సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో ప్రజలకు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగం కారణంగా మహిళల్లో ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం అధిగమించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఆర్ఎస్. సత్యనారాయణరాజు, పౌర సరఫరాల సంస్థ డిఎం మంజుభార్గవి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, వివిధ శాఖల అధికారులు, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రభృతులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతో పనిచేస్తే ఎల్లవేళలా గుర్తింపు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రజలకు మెరుగైన సేవలు అందిం చేందుకు పోలీస్ శాఖలో అంకిత భావంతో పనిచేసే సిబ్బందికి ఎల్లవేళలా తగిన గుర్తింపు లభిస్తుం దని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న కడియాల సాంబశివరావు బుధవారం పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సాంబశివరావును పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం 38 సంవత్సరాల పాటు ఏ విధమైన రిమార్కులు లేకుండా కానిస్టేబుల్ నుండి ఎస్సైగా పదోన్నతులు పొంది ఉద్యోగ నిర్వహణలో ప్రజలకు సేవ చేయడం అనేది భగవంతుడి వరంగా భావించాలన్నారు. పదవి విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ జి.స్వరూపారాణి, ఇన్స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు పదవీ విరమణ చేసిన సాంబశివరావు కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి కుటుంబానికి సహాయం అందాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - వేలేరుపాడు : గోదావరి వరద, పెదవాగు ప్రాజెక్టు వరద వలన నష్టపోయిన ప్రతి కుటుంబానికి వరద సహాయం అందాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రమణరాజు, స్థానిక నాయకులతో కలిసి వరద బాధిత గ్రామాలను మరోసారి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ వరదల వలన నష్టపోయిన గ్రామాల్లో ప్రతి ఒక్కరికి సహాయం అందిందా లేదా అన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఉధృతంగా ప్రవహించిన వరదల వలన ముంపు గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వ పూర్తి సహాయం అందాలన్నారు. కొన్ని గ్రామాలలో ముంపునకు గురైన నిత్యవసర సరుకులు, మూడు వేల నగదు అందలేదన్నారు. నష్టపోయిన రోజులను ప్రభుత్వం అన్ని విధాల అందుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న సన్నకారు రైతులు నష్టపోవడం వలన తిరిగి వ్యవసాయం చేసే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వం విత్తనాలు ఎరువులు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సిపిఐ అండగా ఉంటుందన్నారు. వరదల వలన ఏర్పడిన విద్యుత్, మంచినీటి సమస్యలను అధికారులు పూర్తిగా పరిష్కరించాలన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇప్పటికైనా ప్యాకేజీలు ఇచ్చి పునరావాసం కల్పించి ఇక్కడ నుండి తరలించాలన్నారు. ఈ ఒక్క కుటుంబానికి నష్టం చేకూరిన పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీజీఎస్ జిల్లా అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నెపల్లి సాయిబాబు మండల కార్యదర్శి బాడిస రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్ట ప్రసాద్, పిట్టా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలి

బికెఎంయు ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు

విశాలాంధ్ర - టి. నరసాపురం : ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు మండల సమితి సమావేశం గుడిముడి పాపారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచే వసంత రావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని అడిగిన కూలీలందరికీ పని చూపించాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని, రోజువారి వేతనం రూ. 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు మూడు నెలల నుండి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందడం లేదని వాటిని వెంటనే విడుదల చేసి పేదలను ఆదుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుకుగురైన గ్రామాలను అధికారుల సందర్శించి వారిని ఆదుకోవాలని వారికి నిత్యవసర సరుకులు అందజేయాలన్నారు. మునిగిపోయిన పంట పొలాలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఇళ్ళ స్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికసంఘ మండల కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు కోసం వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో వీరంకి వెంకటరావు, పిల్లి సత్యనారాయణ, సురేష్, పాపారావు, దుర్గమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సి.డబ్ల్యూ.సి. గోడౌన్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సి.డబ్ల్యూ.సి. గోడౌన్స్ లేబర్ యూని యన్ ఆధ్వర్యంలో నల్లజర్ల రోడ్డులోని సి.డబ్ల్యూ.సి. గోడౌన్ ప్రహరీ గోడ పొడవునా మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ వేప మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచాలని సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ పట్టణంలో పురపాలక సంఘం చేపట్టిన రోడ్ల సుందరీకరణలో భాగంగా కమిషనర్ సూచన మేరకు సి.డబ్ల్యు.సి. గోడౌన్స్ వద్ద జట్టు కార్మికులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గోడౌన్ సూపరింటెండెంట్ శివ సాయికుమార్, ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, సి.డబ్ల్యూ.సి. గోడౌన్స్ లేబర్ యూనియన్ నాయకులు గోకా నాగరాజు, తాడేపల్లి వెంకటేష్, కటారి సుబ్బారావు, చిర్ల వెంకటరెడ్డి, గాది అంజిబాబు, అరసపల్లి రామకృష్ణ, ఘంటా సింహాచలం, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవు

అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామపంచాయతీ ఆవరణలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చవ్వాకుల వి. ఆర్. భరత్ కుమార్ మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, సమాచార లోపం కారణంగా కేవలం సచివాలయం, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమావేశం జరిపించారని గ్రామాలలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, చట్టాలు, హక్కులు, దళితులకు వర్తించే రాయితీలు వంటి అంశాలపై చర్చించే అవకాశం లేకపోయిందని గ్రామానికి చెందిన దళితులు ఎవరు సమావేశంలో పాల్గొనలేదని .సరైన సమాచారం ఇచ్చి ఉంటే దళితులు ఈ సమావేశానికి వచ్చి ఉండేవారని అన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కుక్కల. లక్ష్మి, మండలరెవెన్యూ ఇన్స్పెక్టర్ ముత్యాల నాగభూషణం, ఈఓపిఆర్ అండ్ ఆర్. డి. ఎం. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో చేతివాటం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : మండలంలో బోడిగూడెం గ్రామ పంచాయతీ, గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న(వీఆర్వో) రాజేశ్వరరావు చేతివాటం ఎక్కువైందని, ఇటువంటి లంచగొండి అధికారి మాకు వద్దు అంటూ బోడిగూడెం గ్రామ పంచాయతీ అంకాల గూడెం గ్రామ ప్రజలు బుధవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన జానపర్తి నాగమణి మాట్లాడుతూ ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ కోసం ఏడాది కాలం నుంచి తిరుగుతుండగా ఆమె వద్ద నుండి 4వేల రూపాయలు లంచం తీసుకొనగా, మరొక ఆరు వేల రూపాయలు ఇవ్వాలని, తాను ఫోన్ చేసిన చోటికి రమ్మని అంటున్నారని, మహిళ అని కూడా చూడకుండా వీఆర్వో నేను ఫోన్ చేసిన చోటికి నువ్వు రా అని అంటున్నారని నాగమణి తెలిపింది. అంకాల గూడెం గ్రామానికి చెందిన చాపల రమణ అనే మహిళ వద్ద నుంచి పొజిషన్ సర్టిఫికేట్ కోసం 4000 రూపాయలు తీసుకున్నారని, నీకు సర్టిఫికెట్ కావాలంటే మరొక మూడు వేల రూపాయలు ఇవ్వమని వీఆర్వో ఆమెతో తెలుపగా, 3000 రూపాయలు ఇచ్చినా తనకు సర్టిఫికెట్ ఇవ్వలేదని రమణ అనే మహిళ తెలిపింది. బోడిగూడెం గ్రామపంచాయతీ ఒకటో వార్డు మెంబర్ గంట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం వెళితే నేను చెయ్యను అని చెప్పారని, వీఆర్వో రాజేశ్వరరావు , సచివాలయానికి కూడా రావడం లేదని, ఎందుకు రావడం లేదని అడుగగా, ఇంతకుముందు ఒక గిరిజన కులానికి చెందిన వ్యక్తి వీఆర్వో గా పనిచేసి ఆ సీట్లో కూర్చున్నందున, నేను రావడం లేదని పసుపు నీళ్లు చల్లుకొని ఆ సీట్లో కూర్చోవాలని, ప్రతిరోజు విధులకు హాజరైతే రిజిస్టర్‌లో సంతకం చేయాలని, ఆ సంతకం కూడా చేయడం లేదని సుబ్రమణ్యం పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన దిద్దే సురేష్ మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన నాకు క్యాస్ట్ సర్టిఫికెట్ ఇవ్వమని అడగగా ఒక వెయ్యి రూపాయలు లంచం ఇవ్వమని అడిగారని, నా దగ్గర డబ్బులు లేవు అని అన్నందున, నాకు ఇచ్చే క్యాస్ట్ సర్టిఫికెట్ లో బీసీ అని రాశారని, అందువల్ల నేను చాలా ఇబ్బందులు పడుతున్నానని సురేష్ అన్నారు.. ఈ కార్యక్రమంలో కోమటికుంట. సిద్దయ్య, తాళ్లూరి. శ్యాంబాబు, పులి పోయిన. వీర్రాజు, అద్దేపల్లి. సురేష్, చవ్వాకుల నాగేశ్వరరావు, సొంగ. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో పరిహారం..!

- 216 సర్వే నంబర్‌లో భారీ కుంభకోణం
- కుక్కునూరు భూసేకరణలో అక్రమం
- సెంటు లేదు... సుమారు కోటి స్వాహా
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-కుక్కునూరు: కుక్కునూరు మండలంలో 2017లో జరిగిన భూసేకరణలో అక్రమార్కులు 'మసిపూసి మారేడు కాయ ' అన్న చందంగా భారీ అక్రమానికి పాల్పడ్డారని సీపీఐ కుక్కునూరు మండల కమిటీ విమర్శించింది. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. కుక్కునూరు రెవెన్యూ పరిధిలోని నల్లకుంట సమీపంలో ఉన్న 216 సర్వే నంబర్‌లో సెంటు భూమి లేకుండా కుక్కునూరు గ్రామానికి చెందిన బసవ ప్రభాకర్, బసవ రాజామణి ఎనిమిదిన్నర ఎకరాలకు సుమారు 84 లక్షల పైగా పరిహారం అడ్డదారిలో కాజేసారని పేర్కొన్నారు. అప్పట్లో అధికారులను బురిడీ కొట్టించి అక్రమార్కులు రూ. లక్షల్లో పరిహారం పొందారని విమర్శించారు. అటు ప్రభుత్వాన్ని ఇటు అధికారులను మోసం చేసి పరిహారం డబ్బులు మింగేసిన ఇద్దరు అక్రమార్కులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నగదును రికవరీ చేసి.. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె. లక్ష్మయ్య, కూరాకుల బాబూరావు పాల్గొన్నారు.

ఉద్యోగస్తులతోనే పెన్షన్ అందించాలి

విశాలాంధ్ర-కామవరపుకోట : నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్ అందజేస్తున్నారని ఉద్యోగస్తులతోనే పెన్షన్లు అందించాలని సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. ఆగస్టు ఒకటో తేదీన వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, వృద్ధ కళాకారులకు జగన్ ప్రభుత్వంలో వాలంటీర్ ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందించేవారని, కూటమి ప్రభుత్వం ఆగస్టు నెలలో పెన్షన్లను కలెక్టర్తో సహా వార్డు గ్రామ సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించగా, ఆదేశాలకు భిన్నంగా టిడిపి బిజెపి జనసేన కార్యకర్తలు వారి చేతుల మీదుగా ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందని టీవీఎస్ రాజు అన్నారు. ఎన్డీఏ కూటమి తమ రాజకీయ ప్రచారం కోసం నిరుపేద, వృద్ధులకు పంచే పెన్షన్లను రాజకీయ ప్రచార వేదిక చేసుకోవడం తగదని అన్నారు.

వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు డిమాండ్

విశాలాంధ్ర-కామవరపు కోట : వ్యవసాయ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం కామవరపు కోట మండల కేంద్రంలో జరుగుతున్న జిల్లా సమావేశాలు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. మహంకాళిరావు అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వచ్చి రెండు నెలలు అయ్యిందని, ఇప్పటికే ఆయన ఇచ్చిన హామీలపై కసరత్తులు చేస్తూ ప్రకటనలు కూడా చేశారని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం కూడా పొందారన్నారు. అసెంబ్లీలో నిర్ణయాలు చేశారు కానీ కోటి నలభై లక్షల మంది ఉన్న వ్యవసాయ కార్మికుల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి ఒక్క మాట కూడా నిర్ణయం చేయలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించి విధి విధానాలను వెంటనే రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చేందుకు కుట్ర చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పజెప్పి ఉపాధి హామీ బడ్జెట్ కి మాత్రం నిధులు పెంచక పోవడం సిగ్గు చేటన్నారు. పేదలకు ప్రభుత్వ పథకాలు, కనీస వేతనం ఇచ్చే విధంగా రూపొందించి అమలు చేయాల్సిన ప్రభుత్వాలు మొత్తం తగ్గించడానికి కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం. జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు రాజమండ్రి దానియేలు, ఎం.సుదారణి, యూ. వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఏ. ప్రభాకరరావు, పి. చంటి, జి. సత్యనారాయణ, ఎస్. సాయి, హెవాలీ మేరీ, సీత, కుమారి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు తహసీల్దార్ బదిలీ

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండల తహసీల్దారుగా పనిచేసి బదిలీపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బదిలీపై వెళుతున్న కె. పోసిబాబుకు సిబ్బంది అభినందనలు తెలిపారు. బుధవారం నిడమర్రు తహసిల్దార్ కార్యాలయంలో ఆయనకు సన్మానం చేశారు. తహసిల్దార్ పోసిబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సాధారణ ఎన్నికలు 2024 బదిలీల్లో భాగంగా ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో బదిలీ అనేది సర్వసాధారణమని నిడమర్రు మండలంలో తహశీల్దారుగా పనిచేసిన ఆరు నెలల కాలంలో మీ అందరితో పాటు కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శేఖర్ బాబు, ఆర్ఐ సుబ్బారావు, విఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పటిష్ట చర్యలు

ఐజి అశోక్ సూచన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మహిళా రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు సైబర్ నేరాల నిరోధానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజి జీవిజి.అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన నేర సమీక్ష సమావేశానికి ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి

పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఏలూరు, జంగారెడ్డి గూడెం, నూజివీడు మరియు పోలవరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజి అశోక్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, పోస్కో యాక్ట్ కేసులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధను వహించి ముద్దాయిలను త్వరితగతిన అరెస్ట్ చేసి దర్యాప్తును పూర్తి చేయాలని సూచించారు. గతంలో మాదిరిగా స్పీడ్ ట్రైల్ కేసుల్లో ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ కోర్టులలో సాక్షులను ప్రవేశపెట్టి ముద్దాయిలకు శిక్ష పడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ బాలికల విషయంలో జాగ్రత్తగా వహిస్తూ ఉన్నత అధికారుల సూచనలు, ఆదేశాలను పాటిస్తూ ఎప్పటికప్పుడు సత్వర చర్యలు తీసుకొని ఉద్యోగ నిర్వహణ చేయాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ జి.స్వరూపారాణి, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పి ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పి ఎస్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు, నూజివీడు, పోలవరం, జంగారెడ్డిగూడెం డిఎస్పిలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆంధ్రాలో పెండింగ్లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి

ఎంపీ మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన రైల్వే బడ్జెట్ పై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రశ్నోత్తరాల సమయంలో పార్లమెంట్లో ఎంపీ ప్రస్తావించారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో గల ఏలూరు రైల్వే స్టేషన్ లో వందే భరత్ రైళ్ళు నిలుపుదలకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని లిఖిత పూర్వకంగా కోరానని చెప్పారు. ప్రముఖ మార్గాలైన కోటిపల్లి - నర్సాపూర్ రైల్వే లైన్, విజయవాడ - గూడూరు, గుడివాడ - నూజివీడు రైల్వే లైన్ మరియు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం మీదుగా వెళ్లే భద్రాచలం - కొవ్వూరు రైలు మార్గాన్ని వీలైనంత త్వరగా చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

ఉపాధి పథకంలో ఉద్యాన, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహం

విశాలాంధ్ర-లింగపాలెం: ఏలూరు జిల్లాలో ఉపాధి పథకంలో ఉద్యాన, పూలతోటల పెంపకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు డ్వామా పి.డి రాము తెలిపారు. వీటికి సంబంధించిన విషయాలపై విశాలాంధ్రతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని మెట్ట మండలాల్లో ఈ పంటలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో 4,500ఎకరాలలో ఉద్యాన, పూల తోటలు వేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని 3,500 ఎకరాలకు అనుమతులు వచ్చాయని ఆగస్టు, సెప్టెంబర్‌లోపు ఈ తోటలు వేయటం పూర్తవుతుందని తెలిపారు. ఈపథకానికి ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులను మాత్రమే ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొబ్బరి, ఖోఖో, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ ఫామ్, మామిడి, జీడిమామిడి, జామ, నిమ్మ,పశుగ్రాసం పెంపకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గులాబి, మల్లె పూలతోటల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తున్నామని వివరిం చారు. లాభదాయకంగా ఉండే ఈ పంటల ద్వారా రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పాతిక సెంట్లలో గులాబీ పెంచితే రూ.62వేలు, పాతిక సెంట్లలో మల్లె పువ్వులు పెంచితే రూ.55వేలు అందిస్తున్నట్లు వెల్లడించారు. తైవాన్ జామకు ఎకరాకు రూ.2.50లక్షలు, దేశవాళీ జామకు ఎకరాకు రూ.1.47లక్షలు, మామిడికి ఎకరాకు రూ. 1.10లక్షలు, డ్రాగన్ ఫ్రూట్ పెంపకానికి 50 సెంట్లకు రూ.2లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు.

కాలేజీ అభివృద్ధి పై సమీక్ష

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం జూనియర్ కాలేజీ అభివృద్ధిపై ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమీక్ష నిర్వహించారు. కాలేజీలో పూర్తిస్థాయిలో లెక్చరర్ల నియామకానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. సమీక్షలో ఇంటర్ బోర్డు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రభాకర్, కాలేజీ ప్రిన్సిపల్ కౌముది పాల్గొన్నారు. కాలేజీ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ10వేలు, టిడిపి నాయకులు పెదబాబు రూ7వేలు, ఉపాధ్యాయుడు తనగాల మురళి రూ. 5 వేలు విరాళంగా అందించారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్థాపించిన ఈ కాలేజీని అభివృద్ధి చేయటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోరారు.సమీక్షలో టిడిపి నాయకులు నాగబుద్ధ వరప్రసాద్ (బుజ్జియ్య)పాల్గొన్నారు..

జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందజేస్తా

విశాలాంధ్ర -భీమవరం: పాత్రికేయులంటే తనకు ఎంతో అభిమానం, గౌరవమని, భీమవరం నియోజకవర్గంలోని ప్రతి పాత్రికేయుడు సొంత స్థలం కలిగి ఉండాలన్నదే తన ఆశయమని, దానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం పాత్రికేయులు కలిసి సమస్యలను తెలియజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందజేస్తానని, గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని అన్నారు. పాత్రికేయుల స్వయం సహాయ నిధితో భూమిని కొనుగోలు చేసి తమ ట్రస్ట్ ద్వారా పాత్రికేయులకు స్థలాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు కె.ధనరాజ్, పత్సమట్ల శ్రీనివాసరాజు, బిట్రా శివకుమార్, గూడూరి నాగరాజు, తాతారావు, కేతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశ ఫీజు గడువు పొడిగింపు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశముల కొరకు ఫీజు చెల్లింపునకు ఆగస్టు 27 వరకు గడువు ఉందని, తదుపరి అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వ తేదీతో గడువు ముగించబడుతుందని, ఈ అవకాశమును ఓపెన్ స్కూల్ ద్వారా పదవతరగతి మరియు ఇంటర్మీడియట్ చదవాలనుకొనేవారందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చదువు కోసం ఐదు వేలు వితరణ

విశాలాంధ్ర -భీమవరం: కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి, టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు సౌజన్యంతో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా అద్దంకి చంద్రగుప్తాకు పిల్లల చదువు నిమిత్తం ఐదు వేల రూపాయలు అందచేశారు. బుధ వారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గంటా త్రిమూర్తులు చేస్తున్న సేవాకార్యక్ర మాలను అభినందించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ఇందుకూరి సుబ్రమణ్యంరాజు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, బాదరాల పుల్లేశ్వరరావు, రాట్నాల శ్రీనివాసరావు, యలమంచిలి శ్రీను, వినకొండ వినాయక్, మరపట్ల శ్యామ్, అప్పల బాబు, దుర్గారాజు, రాంబాబు, కోటిపల్లి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవుల నియామకంలో అత్యధిక శాతం సముచిత స్థానం కల్పించాలని తెలుగు తమ్ముళ్లు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలోని వినతుల స్వీకరణ ఇన్చార్జిలు రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారధి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిలకు బుధవారం భీమవరం, వీరవాసరం మండలాలు, పట్టణ టిడిపి కమిటీల అధ్యక్ష ప్రధాని కార్యదర్శులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాస్ ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు రేవు వెంకన్న మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని సుమారు 300 మంది టిడిపి నాయకులు పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాలు ఇటీవల జరిగిన ఎన్నికలలో అకుంఠిత దీక్షతో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి విశేషకృషి చేశారని, పార్టీ పటిష్టతకు కృషి చేసిన టిడిపి నాయకులకు అత్యధిక శాతం నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం , వీరవాసరం మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితర నాయకులు పాల్గొన్నారు.

బీపీ మిషన్ అందజేత

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : గర్భిణీల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు మండలంలో బయ్యనగూడెం గ్రామానికి చెందిన నాగరాజు తన సొంత ఆర్థిక సహాయంతో బీపీ మిషన్ ను కొని , ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం కు,ఆశా వర్కర్లకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది బాలింతల ఇంటికి వెళ్ళినప్పుడు బిపి ఎప్పటికప్పుడు పరీక్షించాలని,వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆరోగ్య సిబ్బందికి తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2021- 24 డిగ్రీ పూర్తి చేసిన అవుట్ గోయింగ్ బ్యాచ్ విద్యార్థులు ఫేర్ వెల్ డేను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. కళాశాల గ్రౌండ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాప కులు విద్యార్థులు సిబ్బంది కలిసి విద్యార్థులను అభినందించారు. అనంతరం వీడుకోలు పలికారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తన తోటి విద్యార్థులలతో తన అనుబంధాన్ని గుర్తించుకుంటూ చదువులోనే కాకుండా క్రీడలు సాంస్కృతి కార్యక్రమాలు క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులు విజయం సాధించాలని ఆమె కోరారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్లుకు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి మధురాజు డాక్టర్ సిహెచ్ చైతన్య డాక్టర్ టి అక్కిరాజు, శ్రీనివాసరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రత ధ్యేయం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : గ్రామ పరిశుభ్రత ప్రధాన ధ్యేయమని రామనుజపురం గ్రామపంచాయతీ సర్పంచ్ అడప నాగలక్ష్మి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచడానికి, పారిశుధ్య సిబ్బందితో ప్రతి వీధిలోని పరిశు భ్రత చెపిస్తున్నామని, డ్రైనేజీలు పుడిక తీత పనులు, మంచి నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయించడం జరుగుతుందని, గ్రామస్తులు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఆమె తెలిపారు.

మోసం చేసిన దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : పోలవరం మండలంలో పాత పట్టిసీమ కొత్త పట్టిసీమ గ్రామాలకు చెందిన మొక్కజొన్న రైతులు దళారుడిని నమ్మి మోసపోయిన విషయాన్ని ఏలూరు ఎంపీ పుట్ట.మహేష్ కు తెలియజేయగా వెంటనే ఆయన స్పందించి, రైతులు వద్ద నుండి మొక్కజొన్న కొనుగోలు చేసి మోసం చేసిన దళారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు రావలసిన సొమ్మును దళారుల వద్ద నుంచి వెంటనే ఇప్పించాలని పోలీస్ అధికారులకు సూచించినట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్ తెలిపారు.

దళారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : రైతులను మోసం చేసిన దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలవరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలవరం మండలం కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న పంటను పండించి, మొక్కజొన్న కొనుగోలు చేసే వ్యాపారికి విక్రయించారని, రైతుల వద్ద నుండి 13 కోట్ల రూపాయలు విలువ

చేసే మొక్కజొన్నను, వ్యాపారి కొనుగోలు చేశారని, 10 కోట్ల రూపాయల వరకు వ్యాపారి రైతులకు చెల్లించినప్పటికీ, ఇంకా మూడు కోట్ల రూపాయలు రైతులకు వ్యాపారి అందజేయాల్సి ఉందన్నారు. రైతులు వారి డబ్బులను ఇవ్వాలని వ్యాపారికి ఫోన్ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, వ్యాపారి మొక్కజొన్న కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గోదాము కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామ శివారు పాత టొబాకో బోర్డు వద్ద ఉండడంతో, రైతులంతా కలిసి గోదాములో ఉన్న మొక్కజొన్న, లారీలలో రవాణా చేస్తుండగా అడ్డుకొని, నిరాహార దీక్ష చేపట్టారు. నిరాహార దీక్ష రెండో రోజు చేరుకోవడంతో విషయం తెలుసుకున్న, మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు దీక్ష శిబిరం వద్దకు చేరుకొని రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులను మోసం చేసిన దళారుల పై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, రైతులు పండించి విక్రయించిన మొక్కజొన్న నగదును వెంటనే రైతులకు అందజేయాలని, ఆయన పేర్కొన్నారు.

అన్నదాత కష్టానికి కన్నీళ్లు మిగిల్చిన దళారులు

విశాలాంధ్ర-పోలవరం : ఎంతో కష్టపడి రాత్రి పగలు తేడా లేకుండా చమటోర్చి పండించిన పంటను దళారులకు అప్పచెపితే వారు నిండా ముంచేసారని పోలవరం మండల రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.. వివరాలు ఇలా ఉన్నాయి...గత రబీ సీజన్లో మొక్కజొన్న, ధాన్యం పండించి పొన్నూరి సూరిబాబు అనే దళారికి మండలంలోని 133 మంది రైతులకు సంబంధించి కోటి 23 లక్షల అమ్ముకుని మోసపోయామని రైతులు ఆకుల రాజా, మాదేపల్లి హరిబాబు, ఆబు, వీరపరాజు చిట్టిబాబు, నరసింహారావు, గొంతు మురళి చెబుతున్నారు. అసలు మేము పండించిన పంట లారీలపై ఎక్కడ దిగుమతి చేశారు. దళారి దగ్గర కొన్నది ఎవరు, అనే విషయాన్ని రైతులు దళారిని ప్రశ్నించగా మీకు డబ్బులు కావాలా... లేక అతని పేరు ఆచూకీ కావాలా అంటూ కాలయాపన చేస్తున్నడే గాని దళారు నుండి డబ్బులు మాత్రం రాలేదని రైతులు చెబుతున్నారు. ఒక రైతు ద్వారా కొయ్యలగూడెం గోడౌన్ లో మీ దగ్గర కొన్న ధాన్యాన్ని భద్రపరిచారని సమాచారం రావడంతో ఆ గోడౌన్ వద్ద ధర్నా నిర్వహించామని చెప్పారు. పోలవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేశామన్నారు.ఈ విషయం తెలుసుకున్న

జిల్లా అగ్రికల్చర్ అధికారి ఎస్.కె హబీబ్ భాష బుధవారం పోలవరం వచ్చి రైతులను ప్రశ్నించారు. ప్రభుత్వం మొక్కజొన్న, ధాన్యం గిట్టుబాటు ధరలకే కొంటుందని మీరు దళారులకు అమ్మి మోస పోవడం ఎందుకని అగ్రికల్చర్ జెడి రైతులను అడిగారు. దీంతో వారు సమాధానం ఇస్తూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ముక్కుబడికే తెరిచారని, దానిని రెండు రోజుల్లో మళ్ళీ మూసివేసారని జెడికి తెలిపారు. కష్టంతో పండించిన మొక్కజొన్న పంట ఆరబెట్టుకోవడానికి స్థలము లేక పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద వర్షం వచ్చినా, ఎండ వచ్చిన అక్కడే ఆరబెట్టు కుంటున్నామని ఏమి గతిలేక దళారికే అమ్ము కుంటున్నామని చెప్పారు. ధాన్యానికైతే పండిన పంట వద్దకు అగ్రికల్చర్ అధికారులు వచ్చి ధాన్యాన్ని పరిశీలించి, వారే రేటు కట్టి, కాటా వేయించి, స్లిప్ ఇచ్చి రైస్ మిల్లులకు పంపుతున్నారని, కానీ రైస్ మిల్లు వద్ద 75 కేజీల కింటాకు గాను 70 కేజీలు మాత్రమే వచ్చిందని మిల్లు ఓనర్లు చెబుతున్నారన్నారు. వెంటనే మేము అక్కడ నుండి సొసైటీ కి ఫోన్ చేసి అడుగుతుంటే అగ్రికల్చర్ అధికారులు రైస్ మిల్ ఓనర్ తో మాట్లాడి రెండు కేజీలు తగ్గించుకోండి అని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. కనీసం రైతు భరోసా కేంద్రాల వద్ద గోనె సంచులు కూడా అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు. ఇన్ని కష్టాలు పడి అమ్మడం ఎందుకని దళారులను నమ్ముకుంటే వారు మమ్మల్ని మోసం చేశారని జెడికి రైతులు వివరించారు. దీంతో జెడి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మీ సమస్య తీర్చడానికి రావడం జరిగిందని మీ ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగదని మాటిచ్చారు. వచ్చే సీజన్లో అధికారులతో మాట్లాడి మొక్కజొన్న, ధాన్యం ప్రభుత్వమే గిట్టుబాటు ధరకే కూలీల చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.

పీఎంపీలు నిబంధనలకు కట్టుబడి ఉండాలి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : జిల్లా లోని పిఎంపి, ఆర్ఎంపిలు ప్రభుత్వ నియమ నిబందనలకు అనుగుణంగా పనిచేయాలని అలా చేయకపోతే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది పిఎంపి, మరియు పిఎంపిలు (క్వాక్స్) అబార్షన్లు, రోగులను అడ్మిట్ చేసుకొనుట, ఐ. వి. ఫ్లూయిడ్స్ పెట్టుట, ఇంజెక్షన్లు చేయుట మొదలగునవి చేస్తున్నారని, ఇలా చేసిన వారిపై ఆంధ్ర ప్రదేశ్ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిఎంపీలు, ఆర్ఎంపీలు,ఫస్ట్ ఎయిడ్, గాయా లకు, పుండ్లకు కట్లుకట్టడం, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, సలహాలు చెప్పుట, ఏమైనా కేసులు వారి దృష్టికి వస్తే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు.

కేశవరం తాత్కాలిక బ్రిడ్జి పరిశీలన

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కేశవరం గ్రామంలో ఉన్న వంతెన గత ఐదు సంవత్సరాల క్రితం పడిపోవడంతో తాత్కాలికంగా అప్పన్నపేట కేశవరం రోడ్డుకు రాకపోకలు నిమిత్తం బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఆ బ్రిడ్జి వలన కేశవరం ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలుసుకొని బుధవారం కేశవరం గ్రామంలో ఉన్న తాత్కాలిక బ్రిడ్జిను ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణం రాజు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర -ఆగిరిపల్లి: శోభనాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ ఉపాధ్యా యునిగా పనిచేస్తున్న గంటా సుధారాణి చిన్నాన్న రామచంద్రరావు (రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి) పాఠశాల లోని మొత్తం విద్యార్థులకు సుమారు రూ.25వేల విలువైన నోట్ పుస్తకాలను, లంచ్ బాక్స్ లను, తినుబండారాలను విద్యార్థులకు అందించారు. సుధారాణి ఏ పాఠశాలలో పనిచేసిన ఆ పాఠశాలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు గత పది సంవత్సరాల నుండి చేస్తున్నారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొనియాడారు.

యూనివర్శిటీ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : కృష్ణాయూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల సాయికుమార్ అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో కృష్ణ యూనివర్సిటీ వి సీకి వినతి పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కృష్ణా యూని వర్సిటీలో విద్యార్థులు గతంలో పోలిస్తే ఈ విద్యా సంవత్సరం తగ్గిపోవడానికి ముఖ్య కారణం ట్రాన్స్పోర్టేషన్ సౌకర్యం లేకపోవడం, అదేవిధంగా విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో కూర్చోవడానికి సరైన గదులు లేకపోవడం, మరియు ల్యాబ్లో ఎక్స్పెరిమెంట్స్ చేయడానికి కావలసినటువంటి పరికరాలు లేకపోవడం అని, 2000 మంది విద్యార్థులకు కేవలం నాలుగు బస్సులు మాత్రమే ఏర్పాటు చేయడం జరిగిందని, కావున వెంటనే ఉన్నత విద్యాధికారులు స్పందించి ఈ యూనివర్సిటీ అభివృద్ధికై తోడ్పడాలని విద్యార్థుల తరఫున అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా సమితిగా విన్నవించుకుంటున్నామని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం శ్రీకారం చుడ తాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా కన్వీనర్ సాదిక్ మరియు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నోయిడా ఫ్యాక్టరీని సందర్శించిన శాంసంగ్ వీసీ, సీఈఓ జెహెచ్ హాన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ వైస్ ఛైర్మన్, సీఈఓ, డివైస్ ఎక్స్‌పీరియన్స్ (డీఎక్స్) హెడ్ జోంగ్-హీ హాన్ ప్రస్తుతం భారతదేశంలో ఈ సంవత్సరం తన పర్యటన రెండవ పర్యటనలో ఉన్నట్లు శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ కో. లిమిటెడ్ ప్రకటించింది. ఈ పర్యటన దక్షిణ కొరియా దిగ్గజ సంస్థ కోసం భారతదేశం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తుంది. శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, రిఫ్రిజిరేటర్‌లను తయారు చేస్తోన్న కంపెనీ నోయిడా ఫ్యాక్టరీని సోమవారం హాన్ సందర్శించారు.

పర్యాటక కేంద్రంగా 'మంగినపూడి'

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బీచ్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రి రవీంద్ర తెలిపారు. బుధవారం ఉదయం అధికారులతో కలిసి మంగినపూడి బీచ్‌ను సందర్శిం చారు. అనంతరం రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ నాటి టీడిపి ప్రభుత్వ పాలనలో మంగినపూడి బీచ్ కు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు, పరిసరాలను మెరక చేయడం వంటి అభివృద్ధి పనులు చేశామని, తర్వాత వచ్చిన ప్రభుత్వం బీచ్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బీచ్ లో ప్రైవేట్ భాగస్వామ్యంతో రిసార్ట్స్, ఇతర కార్యకలాపాల నిర్వహణకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ, ఏర్పాటు చేసి బీచ్ సందర్శన సమయాలను పొడిగిస్తామని, సందర్శకులకు ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఫ్లోటింగ్ రోప్స్, రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, సందర్శకులకు భద్రత కల్పిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందించిన అనంతరం అవసరమైన నిధులను సమకూర్చుకున్న వెంటనే మూడు నుంచి ఆరు నెలల్లో పూర్తిగా ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఆర్కిటెక్చర్ కిరణ్, పర్యాటక శాఖజిల్లా అధికారి జి, రామ లక్ష్మణ రావు, ఇంచార్జ్ తహసీల్దార్ సౌజన్య, వీఆర్వో గణేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి కృషి చేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : మహిళలు చిన్నారులపై జరుగుతున్న నేరాలు కట్టడికి ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు హెచ్చరించారు. బుధవారం పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు

నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయనమాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలని అన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులలో సమగ్ర దర్యాప్తు జరిపి మహిళా సంబంధిత నేరాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీ లించి నిర్దిష్ట సమయంలో బాధితులకు న్యాయం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధమ ప్రాధాన్యత అయిన మహిళలు మరియు బాలికల మిస్సింగ్ కేసులను త్వరితగతిన వెతికి పట్టుకోవాలని, నిర్వహిస్తూ గంజాయి పై ఉక్కు పాదం మోపే దిశగా కృషి చేసి కృష్ణాజిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు, యువత, మాదగద్రవ్యాలు, గంజాయి బారిన పడకుండా కాపాడి వారికి బంగారు భవిష్యత్తు అందజేయాలన్నారు. రహదారి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్స్, రేడియం స్టిక్కర్ తో కూడా డ్రమ్ములు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కేసు దర్యాప్తును కిందిస్థాయి సిబ్బందికి విడిచి ఎస్ హెచ్ ఓ లునిర్లక్ష్యంగావ్యవహరిస్తే, శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. వెంకటేశ్వర రావు, ఎడిషనల్ ఎస్పీ ఏ ఆర్ డివిడి ప్రసాద్, డిఎస్పీలు అబ్దుల్ సుభాన్, మురళీధర్, జై సూర్య, శ్రీకాంత్, సుభాష్, నాగరాజు, రమేష్, ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో పాఠశాలలో అంగనవాడి కేంద్రాలను బుధవారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడి ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు,అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని,మురుగునీరు నిలువ ఉండకుండా పారుదల అయ్యేలా, గ్రామాల్లో చెత్తాచెదారం ఎరువు దిబ్బలు తొలగించాలని,గ్రామపంచాయతీ కార్యదర్శులు సిబ్బందికి తెలిపారు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను ప్రత్యేక అధికారిని ఉమాదేవి సందర్శించి మధ్యాహ్న భోజన పథకం పనితీరు విద్యార్థుల హాజరు శాతం,విద్యా బోధన పరిశీలించారు,ఈ కార్యక్రమంలో సిడిపిఓ భాగ్య రేణుక,సూపర్వైజర్ వెంకట రావమ్మ ,గ్రామ సర్పంచ్ పెసరమల్లి సురేష్,కార్యదర్శి రాంజీ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ఆయాలు పాల్గొన్నారు.

సొసైటీకి ఉపయోగపడే పరిశ్రమలు స్థాపించాలి

జెఎన్టీయూకే ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ

విశాలాంధ్ర -భీమవరం: సొసైటీకి ఉపయోగపడే విధంగా ఇంజనీర్లుగా తయారై మంచి పరిశ్రమలను స్థాపించి దేశానికి ఆదర్శంగా నిలవాలని జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ పిలుపు నిచ్చారు. ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే ఫార్మా కంపెనీని ప్రారంభించిన ఒక మహోన్నత వ్యక్తి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చేశారని, ఎందరో మేధావులు తమ పరిశోధనలతో సొసైటీ కి ఉపయోగపడే విధంగా చేసిన సేవలను ఆయన వివరించారు. అనంతరం కాకినాడ జేఎన్టీయూ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్గా నియమితులైన డాక్టర్ మురళీకృష్ణను కళాశాల యాజమాన్యం తరఫున ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

విశాలాంధ్ర - రాజోలు : ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గడంతో రాజోలు మండలంలోని లంక గ్రామాలలో గోదావరి వరదనీరు తొట్లలో నుంచి తిరిగి గోదావరిలోకి వెళ్తోంది. వారం రోజులుగా ముంపునకు గురైన రాజోలు కాటన్, పార్కు, సోంపల్లి శ్మశాన వాటిక, లంకల్లోని కొబ్బరితోటలు ముంపు నుంచి తేరుకుంటున్నాయి. మరోవైపు వరద ముంపు వలన కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. సఖినేటిపల్లి మండలంలో మాత్రం పలు లంక గ్రామాలు వరద ముంపులోనే ఉన్నాయి. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి తగ్గినా, దిగువున సముద్రంలోకి వస్తున్న భారీ వరద ప్రవాహంతో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి లాకుపేట గ్రామాలలో వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో వారం రోజులుగా లంక వాసులకు వరద కష్టాలు తప్పడం లేదు. అక్కడ పడవల పైనే రాకపోకలు సాగిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం హామీల అమలు దిశగా అడుగులు

విశాలాంధ్ర - సీతానగరం: ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం హామీల అమలు దిశగా అడుగులు వేస్తుందని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం కోరుకొండ మండలం కోరుకొండ గ్రామంలోని శ్రీ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇంటర్ విద్యార్థులకు ముఖ్య అతిథిగా ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల హామీ నిలబెట్టుకునే క్రమంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి అమల్లోకి తీసుకువచ్చి అతికొద్ది కాలంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం మా నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా మధ్యాహ్న భోజన పథకం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మధ్యాహ్న భోజన పథకం సమర్దవంతంగా అమలుకు కృషి చేస్తున్నట్లుత జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన తెలిపారు. మైలవరం మండలంలోని చిలుకూరివారి గూడెంలోని అప్పిరెడ్డి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విదాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూను పరిశీలించారు. అనంతరం ఆహార నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు స్వయంగా కలెక్టర్ భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు టీచింగ్ ప్లాన్ ప్రకారం తరగతులు నిర్వహించటంతో పాటు భవిష్యత్తులో కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన సహపాఠ్య కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రతి రోజూ

తరగతులకు హాజరయ్యేలా చూసి ప్రణాళికలకు అనుగుణంగా విద్యా నైపుణ్యాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్తు కెరీర్ పరంగా ఉన్న అవకాశాలు, వాటిని అందిపుచ్చుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. వంటగది, గార్డెన్ అభివృద్ధితో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లో ఇంకా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏతో ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-కంచికచర్ల: మండల పరిధిలోని నిరుద్యోగ యువతి యువకులకు మంచి అవకాశం.చదువు కొని ఉద్యోగ అవకాశాలు కొరకు ఎదురు చూస్తున్న యువతి,యువకులకు డి ఆర్ డి ఎ నుండి ఉపాధి అవకాశాలు కలవు ఈ ప్రక్రియ డి ఆర్ డి ఎ, వెలుగు కార్యా లయంలో అప్లికేషన్ ఇస్తారని, కంచికచర్ల మండల వెలుగు కార్యాలయం ఎపియం భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కొని ఉద్యోగ అవకాశాలు కొరకు ఎదురు చూస్తున్న యువతి యువకులకు డి ఆర్ డి ఎ ద్వారా మంచి అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరు,అన్ని కులాలు వారికి,ఎవరు అయితే ముందుకు వచ్చి స్టాడఫ్ ఇండియా,మరియు ముద్ర పి ఎం ఇ జి పి పథకాలు బ్యాంకు లు ద్వారా ఋణా లు పొందుటకు అవకాశాలుఉన్నాయని, ఇందులో తీసుకున్న ఋణాన్ని బట్టి 35 శాతం నుంచి 45 శాతం వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలియ జేశారు.ఈ పథకం ద్వారా కనీసం 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డి ఆర్ డి ఎ వారు ఈ అవకాశాన్ని కల్పించారు. ఈ పథకాలకు అప్లై చేయాలి అనుకొనే వారు కంచికచర్ల వెలుగు కార్యాలయం లో అప్లికేషన్ ఇవ్వడం జరుగుతుంది. అవసరమైన ట్రైనింగ్ ఆన్ లైన్ అప్లికేషన్, పథకాలకు అవసరమైన డిపిఆర్ అన్ని కంచికచర్ల మండల వెలుగు కార్యాలయంలో ఆగస్టు నెలలో 03-08-24 నుండి 07-08-24 వరుకు జరుగును మీకు ఇంకా పూర్తి వివరాలు కావాలంటే కంచికచర్ల మండల వెలుగు కార్యాలయంలోని వెలుగు కార్యాలయం ఎపియం భాస్కరరావును కలవాలని తెలిపారు.ఈ విషయం మీకు తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలపగలరని డి ఆర్ డి ఎ పిడి, డిడి ఎస్ డెబ్యూ ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల వెలుగు కార్యాలయం వారు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల కమిటీలకు 8న ఎన్నికలు

పేరెంట్స్ కమిటీ పేరును మేనేజ్మెంట్ కమిటీగా మార్చిన ఏపీ ప్రభుత్వం

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : మండలంలోని ప్రభుత్వ పాఠశాల కమిటీలకు ఆగస్టు 8న ఎన్నికలు జరగనున్నాయని మండల విద్యాశాఖ అధికారి టి జోసఫ్ తెలిపారు. ఎన్నికలకు పాఠశాలల వారీగా సంబంధిత ప్రధానోపాధ్యాయులు నేడు ప్రకటనను జారీ చేయనున్నారు. ఐతే ఇప్పటి వరకు పేరెంట్స్ కమిటీగా ఉన్న పేరును రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చింది. ఇక నుండి మేనేజ్మెంట్ కమిటీగా పిలవనున్నారు. ఈ సందర్భంగా ఎమ్ఈఓ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పిల్లల తల్లిదండ్రులు ఆయా పాఠశాల పరిధిలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కమిటీ పాఠశాలలో తరగతులు నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తీరు తదితర వాటిని పర్యవేక్షిస్తాయన్నారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారని తెలిపారు. ఆగస్టు 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ఓటింగ్ జరుగుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో పాఠశాలలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారన్నారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరుల నుంచి సభ్యులు ఒక్కొక్కరు చొప్పున కచ్చితంగా ఉండాల్సి ఉంటుందన్నారు. ఎన్నికైన సభ్యులు రెండు సంవత్సరాల పాటు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలో పాలకపక్షంగా ఉంటారు.

మిషన్ శక్తి వనరులను సమకూరుస్తుంది

ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ

విశాలాంధ్ర - జగ్గంపేట : మిషన్ శక్తి ద్వారా మహిళలకు అవసరమైన వనరులను సమకూర్చడం జరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ తెలిపారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా 7వ వారం జూలై 29 నుండి ఆగస్టు 02 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వీక్ గ్రామంలో ఉన్న సంఘ సభ్యులు భాగస్వామ్యం అనే అంశంపై కార్యక్రమాలు జరుగుతున్నాయి. దానిలో భాగంగా బుధవారం జగ్గంపేట వెలుగు కార్యాలయంలో సంఘ సభ్యులకు మిషన్ శక్తిపై పూర్ణిమ అవగాహన కల్పించారు. మహిళల సాధికారితే మిషన్ శక్తి ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు, బాలికల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పరిచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంసిహెచ్ జగదీశ్వరి, సిసి, వివో ఏఎస్, మండల సిబ్బంది, ఎమ్హెచ్ఎల్పి ఎం ప్రసన్న, సూపర్ వైజర్ సునీత, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏడబ్యూడబ్యూ మహిళలు పాల్గొన్నారు.

మొదటిరోజే 100శాతం పింఛన్ల పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలో నేడు సామాజిక పింఛన్ల పంపిణీ ఉదయం 5 గంటలకే ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కె నరేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా మండలంలోని తాడిపర్రు గ్రామంలో పర్యాటక, సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తప్పనిసరిగా తమ తమ ఇళ్ల వద్ద ఉండాలని కోరారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో మొత్తం 10 వేల 479 మంది పింఛన్ లబ్ధిదారులకు గాను నాలుగు కోట్ల 46 లక్షల 53 వేల రూపాయలు పంపిణీ చేయవలసి ఉంటుందని ఆయన చెప్పారు. బదిలీలు, మరణాలు కారణంగా గత నెల కంటే 93 తక్కువగా ఈనెల పింఛన్ల పంపిణీ ఉంటుంది. 159 మంది సిబ్బందితో మొదటిరోజునే 100శాతం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

విశాలాంధ్ర - సీతానగరం: వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో బుధవారం బొబ్బిల్లంక గ్రామంలో వరదల వల్ల మునిగిన పంట పొలాలు, ఏటి గట్టున స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం నియోజవర్గం పరిధిలోని సీతానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో వేలాది ఎకరాలు నీటి మునిగాయని అన్నారు. రైతులు సాగు చేసే సమయంలో వరద నీరు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ల క్రితం ఇలాంటి వరదలు వచ్చాయని రైతాంగం చెబుతున్నారన్నారు. రూ.91 కోట్లు వ్యయంతో బొబ్బిలంక ప్రాంతం వద్ద రివర్స్ పంపింగ్ స్కీము ఏర్పాటుకు సంబంధించి చాలా వరుకూ అనుమతులు వచ్చాయని సాధ్యమైనంత త్వరగా పనులు మొదలు పెట్టి రైతులను ముంపు భారీ నుండి కాపాడాలని అన్నారు. అలాగే ఏటిగట్టును ఆనుకొని ఎర్త్ బాండ్స్ బలహీనంగా ఉన్నాయని వీటిని మరమ్మతులు చేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రూ 24 కోట్లు అంచనా వ్యయంతో డిజాస్టర్ మేనేజ్మెంట్ నుండి నిధులు మంజూరు చేయమని కోరడం జరిగిందని వెంటనే వాటికి సంబంధించిన పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుటూరి శ్రీ హరి బాబు, మల్లీన చౌదరి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళలను సత్కరించిన నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి విజయానికి ఎన లేని కృషి చేసిన తెలుగు మహిళలను ఘనంగా సత్క రించారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యకర్త వనుములు సౌజన్యంతో తెలుగు మహిళలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి, మాజీ ఎంపిపి కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

సి రాయవరంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని సి రాయవరం గ్రామంలో నీటి కుంటలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ప్రత్తిపాడు సిఐ శేఖర్ బాబు, అన్నవరం ఎస్ఐ ఎం కిషోర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సి రాయవరం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) మార్కండేయపురంలో నివాసముంటున్నట్లు గుర్తించామన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృత్యునికి భార్య గజ్జి అనంతలక్ష్మి, ఒక కుమార్తె, ఒక కుమారుడు జగదీష్ ఉన్నారన్నారు. మృతుడి నుదుటిపై మెడపై గాయాలతో నీటి గుంటలో పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని అన్నారు. సంబంధిత కుటుంబీకులను వివరాల ప్రకారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగం

కమిషనర్ ముందు స్మార్ట్ సిటీలో సమస్యల చిట్టా..

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర ప్రభుత్వం కాకినాడ నగరాన్ని 2016లో స్మార్ట్ సిటీగా ప్రకటించి నగర సమగ్ర అభివృద్ధికి, ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదలకు కొట్లాది రూపాయలు కేటాయించినప్పటికీ ప్రధాన సమస్యలు కాకినాడ స్మార్ట్ సిటీ ప్రజలను ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయని బిజెపి ఆరోపించింది. సానిటరీ పనిముట్లు కొనేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు వాడాల్సిన దుస్థితిలో నేడు మున్సిపాలిటీ ఉంది అంటే మున్సిపల్ కార్పొరేషన్ దివాలా తీసినట్టుగానే ప్రజలు భావిస్తున్నారని బిజెపి తీవ్రంగా ఆరోపించింది. 2019-2024 మధ్య కాలంలో కాకినాడ మున్సిపాలిటీ మరియు స్మార్ట్ సిటీ నిధులు తీవ్రంగా దుర్వినియోగం అయ్యాయని బిజెపి తీవ్రంగా ధ్వజమెత్తింది. ఈరోజు ఉదయం 11 గంటలకు బిజెపి కాకినాడ నగర్ కన్వీనర్ గట్టి సత్యనారాయణ నేతృత్వంలో దువ్వూరి సుబ్రహ్మణ్యం, గరిమెళ్ళ శర్మ, గోడి సత్యవతి, బొక్క వెంకటరమణ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కాకినాడ మున్సిపల్ కమిషనర్ను కలిసి వినతి పత్రం సమర్పించింది. గత ఐదు సంవత్సరాల కాలంలో అధికార యంత్రాంగంలో, రాజకీయ నాయకత్వంలో పెరిగిన అవినీతి, కొరవడిన ముందుచూపు ఈ పరిస్థితులకు కారణమని బిజెపి ఈ వినతి పత్రంలో పేర్కొంది. కాకినాడ నగరంలో సుమారు 100 కోట్ల రూపాయలు స్మార్ట్ సిటీ నిధులు ఖర్చు చేసి కమాండ్ కంట్రోల్ సిస్టమును ఏర్పాటు చేయడం జరిగిందని, సుమారు 350 సీసీ కెమెరాలు, గ్లోబల్ పొజిషన్ సిస్టం, పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టం పనిచేసేందుకు కీలకమైన ఈ కమాండ్ కంట్రోల్ సిస్టం గత మూడు సంవత్సరాలుగా పనిచేయటం లేదని బిజెపి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చింది. పోలీసులకు నేర పరిశోధన, నేర నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నగరంలో చైన్ స్నాచింగ్ వంటి నేరాలు తీవ్రంగా పెరిగినప్పటికీ నేరస్తులను గుర్తించి శిక్షించడంలో పోలీసు యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందు తోందని బిజెపి తీవ్రంగా ఆరోపించింది. దురదృష్ట వశాత్తు పోలీసుల ఆధీనంలో ఉన్న సీసీ కెమెరాలు కూడా నగరంలో పనిచేయడం లేదని బిజెపి పేర్కొంది. కాకినాడలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వేసవిలోన కాకుండా అన్ని కాలాల్లోనూ ఈతాగు నీటి ఎద్దడి నగరంలో గమనించవచ్చని బిజెపి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చింది. దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను నిరుపయోగంగా ఉంచివేశారని అందుకు గాంధీ నగర్ బాలభవన్లో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఒక ఉదాహరణని, స్థానిక ప్రతాప నగర్లో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన ప్రతాప్ నగర్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కూడా లీకులతో సతమతమవుతుందని బిజెపి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చింది.

నగరంలో పారిశుద్ధ్యం అంతంతమాత్రంగా ఉందని, ప్రస్తుతం డివిజ న్కు 15 మంది ఉన్న ఔట్సోర్సింగ్ సానిటరీ సిబ్బంది సరిపోవటం లేదని బిజెపి అభిప్రాయ పడింది. నగరంలో 15 మంది ఉండవలసిన శాని టరీ ఇన్స్పెక్టర్ల సంఖ్య ప్రస్తుతం 8కి పడిపోయిం దని, త్వరలో మరో ఇద్దరు రిటైర్ కానుండటంతో ఈ సంఖ్య 6 చేరుకోనున్నదని, దీనితో భవిష్యత్తులో పారిశుద్ధ్యం మరింత దుర్భరంగా మారనున్నదని బిజెపి ఆందోళన వ్యక్తం చేసింది. అదేవిధంగా చెత్త రవాణాకు ప్రస్తుతం నగరంలో 15 ట్రాక్టర్లు తిరుగు తుండగా ఈ సంఖ్య అవసరాలను తీర్చలేక పోతుం దని బిజెపి కమిషనర్కు తెలియజేసింది. గ్రామ సచివాలయ సెక్రటరీల సేవలను కూడా నగర కార్పొరేషన్ సక్రమంగా వినియోగించు కోలేకపో తుందని బిజెపి అభిప్రాయపడింది. నగ రంలో 2014-2019 మధ్య టిడికో పథకం కింద 2056 ఇళ్లను నిర్మించగా అందులో 2019-2024 మధ్య కేవలం 1000 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని, మిగిలినవి ఇప్పటికీ పంపిణీ చేయాల్సి ఉందని అన్నారు. తక్షణం నగరంలో సంవత్సరాలుగా పాతుకుపోయిన ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని బిజెపి ఆ వినతి పత్రంలో కమిషనర్ను కోరింది. ఈ బృందంలో మండల అధ్యక్షులు చెక్క రమేష్, పానకాల రామకృష్ణ, బర్రె శ్రీను, గోడి వెంకట్, సంఘాని సత్యం, కందాల రవి ఉన్నారు.

ప్రజా సమస్యలపై గళం ఎత్తిన కౌన్సిలర్లు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై ఆయా వార్డు కౌన్సిలర్లు గళం విప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు బుధవారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన జరగగా ముందుగా సభ్యులు పట్టుబట్టడంతో జీరో వరకు అనుమతులు ఇచ్చారు. ముందుగా సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మాట్లాడుతూ అధికారులు చాలామంది సమావేశానికి రాకపోవడం దారుణమని అన్నారు. మంచినీటి చెరువులోచెరువులో అక్రమ చేపలవేట, జనరల్ ఫండ్ నిధులపై చర్చకు కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. బిపిఎల్ బకాయిలపై తక్షణ చర్యలు చేపట్టాలని, పట్టణంలో అన్ని వారులకు ప్రాధాన్యత నిస్తూ సమస్యలు పరిష్కరించాలని వైస్ ఛైర్మన్ ఊభా జాన్ మోజేష్ కోరారు. అలాగే గ్యాస్ పైప్ లైన్కు సంభందించి ఎలాంటి పన్నులు మున్సిపాలిటీకి రావడం లేదని ఆ విషయం పై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారని ప్రశ్నించారు. అలాగే పారిశుధ్య వాహనాల ఆయిల్ పేరుతో పలువురు నిధుల స్వాహా చేస్తున్నారంటూ కౌన్సిలర్ లాయర్ శ్రీను, పితాని కృష్ణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాల ఆయిల్ బిల్లుల వివరాలు అందించాలన్నారు. ఇంకా 7వ వార్డు కౌన్సిలర్ జట్లా మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారి అత్యంత దారుణంగా ఉన్నందున దానిని నిర్మించాలని పలుమార్లు లెటర్లు పెట్టినా దానిని నిర్మించడం లేదని ఇప్పటికైనా ఆ రహదారి నిర్మించకుంటే తాను ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోనున్నట్టు హెచ్చరించారు. ఇంకా సమావేశంలో కౌన్సిలర్ కాళ్ళ రాజేశ్వరి మాట్లాడుతూ తమ వార్డులో పనిచేసే పారిశుధ్య కార్మికుడు మృతిచేందగా ఆయన స్థానంలో వేరే సిబ్బందిని నియమించలేదన్నారు. దానితో పారిశుధ్య పనులను తాము బయటి వ్యక్తులకు డబ్బులిచ్చి చేయించు కోవాల్సి వస్తుందని, ఈ కారణంగా తక్షణం తమ వార్డులో పారిశుధ్య కార్మికుని ఏర్పాటు చెయ్యాలని కోరుతూ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వార్డులో ఉన్న పలు సమస్యలపై మరి కొద్ది మంది కౌన్సిలర్లు గళం విప్పారు కమిషనర్ రామారావు పలువురు కౌన్సిలర్లకు సమాధానం ఇచ్చారు. కాగా జీరో అవర్ అనంతరం కౌన్సిల్ ఎజెండాలో మొదటి అంశాన్ని వాయిదా వెయ్యాలని వైస్ చైర్మన్ జాన్ మోసెస్ కోరుతూ మిగిలిన అంశాలను ఆమోదిస్తున్నట్టు చెప్పగా దానికి కౌన్సిలర్ జట్లా మోహన్ అభ్యంతరం తెలిపారు. అన్ని అంశాలపై చర్చ జరపాలని లేదంటే వాటిపై డీసెంట్ తెలుపుతానని చెప్పారు. అయినప్పటికీ మిగిలిన అంశాలను మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపడంతో సమావేశాన్ని చైర్ పర్సన్ ముగించారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరాలి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : విద్యతోనే ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి నడవడికను కలిగి ఉండాలని అన్నారు. మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని వివిధ టాలెంట్ టెస్ట్కు ఎంపికయ్యి మంచి ఉద్యోగాలలో చేరాలని ఆమె కోరారు. తాను కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివానని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభు త్వం అనేక పథకాలను ప్రభుత్వ పాఠశాలలకు చేకూరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులను, పుస్తకాలను అంద జేశారు. లింగంపర్తి గ్రామంలో విద్యార్థులకు అందజేసే భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాల కృష్ణ, నారాయణస్వామి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనుపల్లి పాఠశాలకు కంచాలు, మిక్సీ వితరణ

విశాలాంధ్ర - అమలాపురం : జనుపల్లి ప్రాథమిక పాఠశాలలో బాణాల వెంకటేశ్వరావు, ఎంపీటీసీ పొలిశెట్టి చిన్న, మెంబెర్ కర్రీ లక్ష్మిదుర్గ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్కెవై ఫౌండేషన్ వ్యవస్థాపకులు నల్లా అజయ్ అడపా ప్రకాష్ మరియు ఫౌండేషన్ సభ్యులు హాజర య్యారు. ఫౌండేషన్ తరపున పాఠశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం కోసం తొమ్మిదివేల రూపాయలతో 30 స్టీలు కంచాలు, మిక్సీ మరియు కుక్కర్లు అందచేశారు. విద్యార్థుల కొరకు భవిష్యత్తులో మరింత తోడ్పాటుని అందిస్తామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఫౌండషన్ సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. సర్పంచు, ఎంపీటీసీ మెంబరు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పొలిశెట్టి ఏసురత్నం, విద్యార్థులకు మిఠాయిలు, స్నాక్స్ పంచి పెట్టారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

విశాలాంధ్ర - దేవరపల్లి : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో తెలుగు టీచర్గా పనిచేస్తున్న హుస్సే శంకరుడు పదవి విరమణ సందర్భంగా జరిగిన సభకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడు తూఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమ శిక్షణతూ పాటు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తారని ఆయన అన్నారు. జీవిత పాఠాలు నియమ నిబద్ధత సంస్కరణలు నేర్పేదే ఉపాధ్యాయ వృత్తి అని కేవీకే దుర్గారావు అన్నారు. అవినీతికి తావులేని వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు ఉపాధ్యాయునికి సంఘంలో ఎంతో గౌరవం ఉంటుందని దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతి దగ్గర నుండి గ్రామ ప్రథమ పౌరులు సర్పంచి వరకు అందరూ ఉపాధ్యాయులు వద్ద విద్య నేర్చిన వారేనని అన్నారు గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు మాట్లాడుతూ శంకరుడు మాస్టారు 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా అనేక సేవలు అందించారు అన్నారు శంకరుడును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు దేశం సీనియర్ నేతలు గన్నమని హరికృష్ణ సుంకర దుర్గారావు బల్ల సూరి చక్రం తదితరులు హుస్సేశంకరుని సేవలను వివరించారు ప్రధానోపాధ్యాయురాలు బి శ్రీలక్ష్మి మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు హుస్సే శంకరుని సలహాలు తీసుకుంటున్నానని వివరించారు. ఈ సందర్భంగా హుస్సే శంకరుడు ఆయన భార్య ఎన్ వి కుమారిని ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 అప్పారావు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ కార్యదర్శి షరీఫ్ బాలయ్య దేశం నేత కొయ్యలమూడి చినబాబు గన్నమనే హరికృష్ణ సుంకర దుర్గారావు తంబాల సత్తిబాబు జనసేన నేతలు కంబాల సత్తిబాబు జాజిమొగ్గల శ్రీనివాస్ సూరిశెట్టి బాలు రిటైర్డ్ ఖజానా అధికారి డి గంగాధరరావు మాజీ జెడ్పిటిసి కోయిలమూడి సుధారాణి ఓరిగంటి నాగరాజు ఉపాధ్యాయులు వి వి కె రామారావు మాధవరపు లక్ష్మీనారాయణ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పప్పు వెంకట రామారావు ఎలమాటి సత్యనారాయణ ఉపాధ్యాయులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత హుస్సే శంకరుడు మాట్లాడుతూ 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా నని యుటిఎఫ్లో అనేక హోదాలో పని చేశానన్నారు. దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో పని చేసే రిటైర్డ్ కావడం తన అదృష్టమని ఆయన వెల్లడించారు.

ఎస్ఎంసి ఎన్నికలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర - కరప : ప్రభుత్వం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఆగస్టు ఒకటో తేదీన విడుదల చేయడం జరిగిందని ఎంఈఓ కేవి కృష్ణవేణి తెలిపారు. కరప మండల విద్యావనరుల కేంద్రం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరితో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలను రూపొందించే ఏర్పాట్లు చేసుకోవాలని ఉపాధ్యాయులకు తెలుపమన్నారు. ఎన్నికల పరిశీలకులుగా తహశీల్దార్, ఎంపీడీవో, వీఆర్వో, విఆర్ఏలు ఉంటారని ఎన్నికల కన్వీనర్గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొనసాగుతారన్నారు. ఈనెల 1వ తేదీన నోటిఫికేషన్ విడుదలైన వెంటనే వాటర్ జాబితాను సిద్ధం చేసుకోవాలని, ఐదవ తేదీన వాటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేసుకుని, ఎనిమిదో తేదీన ఎన్నికల నిర్వహించాలని ఎంఈఓ తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్లను కమిటీ సభ్యులలో ఇద్దరిని ఎన్నుకోవాలని వీరిలో తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ మహిళకు, బిసి మైనార్టీలకు తప్పనిసరిగా చోటు కల్పించాలన్నారు. నోటిఫికేషన్ వెలువడగనే పాత కమిటీ రద్దు అవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సత్యనారాయణ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బుచ్చిబాబు పరామర్శ

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్లూరు మండలంలో బుధవారం జార్జిపేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ కీర్తిశేషులు మందపల్లి నాగమ్మ కుటుంబ సభ్యులను అదేవిధంగా పువ్వుల రాంబాబు అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జార్జిపేట ఎంపీటీసీ సభ్యులు కీర్తిశేషులు నాగమ్మ కుమారుడు రాంబాబు ఎమ్ఎల్ కె నగర్లో గల పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, తాళ్లరేవు మండల అధ్యక్షులు నాయుడు గంగాధర్ సునీత, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్య నారాయణ, వాడ్రేవు వీరబాబు, ముమ్మిడివరం నగర పంచాయతీ ఎక్స్ చైర్మన్ చెల్లి అశోక్, కట్టా త్రిమూర్తులు, వినోద్ రాజు, మోపురి వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కరరాజు, గుత్తుల సూరిబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి పిల్లలతో దేశ ప్రధానమంత్రి మన రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి పేర్లను ప్రశ్నించి వారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. పిల్లలు దానికి సరియైన సమాధానాలు ఇవ్వడంతో భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జార్జిపేట గ్రామ టిడిపి కన్వీనర్ కూనపురెడ్డి కామేశ్వరరావు, గుత్తుల సూరిబాబు, సుబ్బరాజు, పెదపాటి కామేశ్వరరావు, కడలి శ్రీనివాస్, కడియం శ్రీనివాస్, కనకాల రాంబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, దంగేటి సూరిబాబు, పిల్లి సత్తిబాబు, దండు శ్రీను, కాలా సత్తిబాబు మరియు టిడిపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం తాళ్ళరేవు మండలంలోని నీలపల్లి, ఉప్పొంగల, ఇంజరం, కోరంగి, బొడ్డు వెంకటాయపాలెం, తాళ్లరేవు తదితరు గ్రామాలలో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబాలను శాసన సభ్యులు పరామర్శించారు. అదేవిధంగా బుధవారం ఉదయం అకాల మృతి చెందిన కోరంగి గ్రామానికి చెందిన మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రమౌళి పార్థీవ దేహానికి నివాళులర్పించిన ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, మండల టిడిపి, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు సత్య సాయి సేవ సంస్థ సభ్యులు కంకటాల సత్యనారాయణమూర్తి తెలిపారు. బీపీ షుగరు గుండెకు సంబంధించిన వ్యాధులపై కొత్తపేట రామ నర్సింగ్ హోమ్ డాక్టర్ గాంధీ ప్రతి నెల ఒక రోజు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సత్య సాయి సేవ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు ప్రారంభించారు. అలాగే ఉచిత కుట్టు మిషన్ల శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొన్ని నెలపాటు ఈ శిక్షణ కొనసాగుతుందని ఆసక్తి ఉన్న మహిళలు సత్య సేవ మందిరం వద్ద శిక్షణ పొందాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండబాబు, వివేకానంద రెడ్డి, మన్యం వర్ధన రావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర - ముమ్మిడవరం : ముమ్మిడివరం మండలంలో వరద ముంపునకు గురైన గురజాపులంక, లంకాఫ్ఠాణేలంక, కమినీ తదితర గ్రామాలలో రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ బాధితులను పరామర్శించి బాధితులకు తర్పలిన్ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సహాయం చేయడంలో రెడ్ క్రాస్ సంస్థ ముందుంటుందని ఆయన తెలిపారు. ముంపునకు గురైన లంక ప్రాంతాల్లో పశువులకు పశుగ్రాసం దాన అందజేస్తామని తెలిపారు.

పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : 31వ తేది కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశంను జిల్లా పోలీస్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, పోస్కో చట్టం, గంజాయి అక్రమ రవాణా కేసులపై ప్రత్యేక శ్రద్ధను వహించి, ముద్దాయిలను త్వరితగతిన అరెస్ట్ చేసి దర్యాప్తును సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మైనర్ ఆడపిల్లలు, మహిళల విషయాలలో చాలా జాగ్రత్త వహిస్తూ, వారి సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ల యొక్క కదలికలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా జిల్లా కేంద్రానికి రాబడిన ఫిర్యాదులపై వెంటనే విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో దుకాణ సముదాయాలు, దేవాలయాలు, అపార్ట్మెంట్లు సముదాయాల సీసీటీవీలను ప్రతి ఒక్క పోలీసు అధికారి పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ వీజీఏ భాస్కర రావు, అదనపు ఎస్పి శ్రీలక్ష్మి, డీఎస్పిలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తీర ప్రాంత పర్యావరణ రక్షణకు చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : తీరప్రాంతాల్లోని మత్స్యకార సంఘాలు, స్థానిక వర్గాలకు జీవనోపాధి భద్రతతో పాటు, తీరప్రాంత సముద్ర ప్రాంతాల ప్రత్యేక పర్యావరణాన్ని పదిల పరచి రక్షించి సహజ ప్రమాదాలను పరిగణనలోకి తీసుకొని 2011సిఆర్జెడ్ కంటే 2019సిఆర్జెడ్ను సవరించిందని జిల్లా జాయింట్ కలెక్టర్టి నిషాంతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు 2019 కోస్తా జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ ముసాయి దాపై. (సిఆర్జెడ్) ప్రజాప్రాయసేకరణ ప్రక్రియ తీర ప్రాంత మత్స్యకార సంఘాల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2011 సిఆర్జెడ్ కన్నా 2019లో సవరించిన సిఆర్జెడ్ ప్రతిపాదనలు శాస్త్రీయ సూత్రాల ఆధారంగా స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తూ ప్రమాదాలు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా సముద్ర మట్టం పెరుగుదల అదుపు చేయడం ఈ ముసాయిదా నోటిఫికేషన్ యొక్క లక్ష్యమన్నారు. పర్యావరణం, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, 2011 సిఆర్జె స్థానంలో 2019ను సవరించి ప్రవేశపెట్టిందన్నారు. సముద్రపు అలల సమయంలో అత్యధిక నీటి లైన్ చేరుకునే భూమిపై ఉన్న లైన్, నిర్దేశించిన విధానాలకు అను గుణంగా నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మెనేజ్ మెంట్ ద్వారా గుర్తించ బడిందన్నారు. ప్రస్తుతం కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిమితి 50 మీటర్లు వరకు నిర్ధారించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ సందీప్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.